క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు



ఆర్టీఐ కమిషనర్ సునీల్, విశ్రాంత జడ్జి శ్యాంప్రసాద్‌కు ప్రసాదం అందిస్తున్న రాంబాబు

సింహాచలం: వరహాలక్ష్మీ నృసింహ స్వామిని రాష్ట్ర సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కమిషనర్ చావలి సునీల్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జి.శ్యాంప్రసాద్‌లు బుధవారం దర్శించుకున్నారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అర్చకులు వేదాశీర్వచనమిచ్చారు. ఆలయ ప్రొటోకాల్ ఏఈవో వెంపలి రాంబాబు, పర్యవేక్షకుడు జీవీఎస్‌కే ప్రసాద్ వారికి శేషవస్త్రం, జ్ఞాపిక, ప్రసాదం అందించారు.

ఘనంగా వెంకన్న తిరువీధి



సింహాచలం: సింహాద్రి కొండ దిగువున కొలువు దీరిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం తిరువీధి అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేత్రపర్వంగా సహస్రనామార్చన



నిత్య కల్యాణం చేస్తున్న అర్చకులు

సింహాచలం: వరాహలక్ష్మీ నృసింహస్వామికి సహస్రనామార్చన బుధవారం నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. మంత్రపుష్పం, మంగళాశాసనం జరిపారు. అనంతరం నిత్య కల్యాణం వైభవంగా చేశారు. భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందించి, స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

శాస్త్రోక్తంగా శివశివాని విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు, పీలా గోవిందసత్యనారాయణ

పెందుర్తి: సరిపల్లి మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివ శివానీ సహిత ఆదిశంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, హోమాలు చేశారు. అనంతరం విగ్రహ యంత్ర ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం దాదాపు 8 వేల మందికి అన్నప్రసాదం అందించారు. ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, ఆలయ ప్రతినిధు లు, గ్రామపెద్దలు, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం రేపు

దాబాగార్డెన్స్/పెందుర్తి : జీవీఎంసీ రైవాడ నీటి సరఫరా పథకం ద్వారా నరవ నుంచి టీఎస్సార్‌కు వచ్చే పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి రాత్రి 8 వరకు తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు జీవీఎంసీ వాటర్ సప్లై ఈఈ మురళీకృష్ణ తెలిపారు. జోన్ – 8 పరిధిలో లక్ష్మీనగర్ – ఎఫ్ బ్లాక్ పార్ట్, సీ, డీ బ్లాక్ పార్ట్, శ్రీనివాసనగర్, ఆర్ఆర్‌వీ పురం, రజక కాలనీ తదితర ప్రాంతాలకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వరవాడ: పెదముషిడివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితంగా పెదముషిడివాడ శివారు గ్రామాలు, గొన్నవానిపాలెం, ఈ మర్రిపాలెం, కన్నూరు,మంత్రిపాలెం, లంకెలపాలెంలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

అంతకాపల్లి ఫీడర్ పరిధిలో..

నబ్బవరం: మండలంలోని అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధి పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు ఉండబోదని ఈఈ రామకృష్ణ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకు అంతకాపల్లి, రావలమ్మపాలెం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, రాయపుర అగ్రహారం, ఆరిపాక, బంగారమ్మపాలెం, అద్దూరు, గొటివాడ, లగిశెట్టిపాలెంలలో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

ఉద్యాన పంటల సాగుకు పెట్టింది పేరు సబ్బవరం మండలం. విశాఖ నగరానికి అతి చేరువ కావడం, మార్కెటింగ్ సదుపాయాలు ఎక్కువగా ఉండటంతో అధిక సంఖ్యలో రైతులు ఉద్యాన పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. పలు రకాల కూరగాయలు, అకు కూరలను ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుంటున్నారు.



అమృతపురంలో మల్చింగ్ షీట్ వేసి సాగుచేస్తున్న బొప్పాయి పంటను పరిశీలిస్తున్న హెచ్‌వో కిరణ్మయి తదితరులు

ఉద్యాన సాగు.. లాభాలు బాగు

మండలంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం

టమాటా	92 ఎకరాలు
బెండ	42 ఎకరాలు
వంగ	31 ఎకరాలు
చిక్కుడు	36 ఎకరాలు
ఇతర పంటలు	59 ఎకరాలు

సబ్బవరం మండలంలో ఉద్యాన పంటల వైపు రైతుల మొగ్గు

పందిర్లు, మల్చింగ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఆధునిక సాగు విధానాలను అవలంబిస్తున్న రైతులు



మల్చింగ్ షీట్ వేసి సాగు చేస్తున్న ఉద్యాన పంటలు

నబ్బవరం: సబ్బవరం మండలం దాదాపుగా వర్షాధారిత ప్రాంతం. సంప్రదాయ వ్యవసాయ పంటలతో పాటు, ఉద్యాన పంటల సాగు చేయాలన్నా ఇక్కడ నీటి ఎద్దడే ప్రధాన సమస్య. దీంతో రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మళ్లుతున్నారు. చెరకు, వరి వంటి పంటలకు నెలల తరబడి నీటి అవసరం ఉంటుంది. సమృద్ధిగా నీటి వనరులు లేని ప్రాంతం కావడం, మరోవైపు ఇక్కడ అధికంగా చిన్నచిన్న కమతాలే ఉండటంతో ఆరుతడి పంటలైన ఉద్యాన పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం మండలంలో 260 ఎకరాల్లో వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయల సాగు జరుగుతోంది.

మండలంలో ఎక్కువగా అమృతపురం, తవ్వవానిపాలెం, బాటజంగాలపాలెం, వంగలి, ఆరిపాక గ్రామాల్లో ఉద్యాన పంటల్ని సాగుచేస్తున్నారు.

పందిరి సాగులో సగం రాయితీ

తీగజాతి పంటలైన బీర, దొండ, కాకర, ఆగాకర, ఆనప, పొట్లకాయ వంటి పంటలు పందిర్లు వేసి, సాగు చేసేందుకు అనువగా ఉంటాయి. ఈ విధానంలో దిగుబడి ఎక్కువ. పందిర్ల సాగు విధానంలో ఉద్యాన పంటలను ఎకరాకు రూ.2 లక్షలు వరకూ వ్యయం అవుతుంది. రైతు ముందుగా రూ.2 లక్షలు వెచ్చించి పందిర్లు వేసుకుంటే, ఉద్యాన శాఖ 50 శాతం(రూ.లక్ష) వరకూ రాయితీ అందిస్తుంది.



పందిరి సాగు విధానంలో బీర పాదులు

మల్చింగ్‌తో కలుపు నియంత్రణ

నీటి ఎద్దడి అధికంగా ఉండే ఈ ప్రాంతంలో పంటకు అవసరమైన నీటిని అందించడంతో పాటు, పంటకు తేమ తగ్గకుండా మల్చింగ్ షీట్ వేసుకోవడం ఉపయోగకరమని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు పంటలో వచ్చే కలుపు నివారణకు సైతం ఇది ఎంతగానో ఉపయోకరం కావడంతో రైతులు అధికంగా దీన్నే వినియోగిస్తున్నారు. తద్వారా కలుపు తీసేందుకు కూలీల సమస్యను అధిగమించి, నీటి ఎద్దడిని తగ్గించుకోగలరుతున్నారు. అన్ని రకాల ఉద్యాన పంటల సాగులో మల్చింగ్ షీట్ వేసుకోవచ్చు. ఇందుకు హెక్టార్‌కు రూ.50 వేలు వరకూ ఖర్చవుతుంది. ఇందులో ప్రభుత్వం రూ.20 వేలు వరకూ రాయితీ ఇస్తుంది.

కౌలుకు తీసుకుని సాగు



బొప్పాయి 2 ఎకరాలు, కాలీ ఫ్లవర్ 2 ఎకరాలు, టమాటా 3 ఎకరాలు, ఉల్లి, అరటి వంటి పంటలు మరో రెండు ఎకరాల్లో సాగుచేస్తున్నాను. ఇందులో సొంత భూమి కొంతే. మిగిలింది కౌలు, లీజుకు రైతుల నుంచి తీసుకుని ఉద్యాన పంటల సాగు చేస్తున్నా. మల్చింగ్, డ్రిప్ విధానంలోనే సాగు చేస్తాను. ఒక సారి వేసుకున్న మల్చింగ్ షీట్ రెండు పంటల వరకూ ఉపయోగపడుతుంది. దీని కోసం ప్రభుత్వం రాయితీ కూడా అందిస్తోంది.

– సబ్బవరపు బంగార్రాజు, రైతు, అమృతపురం

ఉద్యాన సాగుకు ప్రోత్సాహం



ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం రైతుల్ని ఎంతగానో ప్రోత్సహిస్తోంది. రైతులు ఆధునిక పద్ధతిలో పంటలను సాగు చేస్తూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోనేందుకు పలు రాయితీలను అందిస్తోంది. పందిర్ల విధానంలో తీగజాతి పంటల సాగుచేయడం చాలా లాభదాయకం. కలుపు నివారణ, కూలీల సమస్య అధిగమించేందుకు మల్చింగ్ విధానం మేలు. ఈ రెండింటికీ ప్రభుత్వ సబ్సిడీ ఉంది. రైతులు దీన్ని వినియోగించుకోవాలి.

– కిరణ్మయి, ఉద్యాన శాఖ అధికారి, సబ్బవరం

నారాయణపాత్రుడికి అదీప్‌రాజ్ పరామర్శ



నారాయణపాత్రుడిని పరామర్శిస్తున్న అదీప్‌రాజ్

పెందుర్తి: ఇటీవల అనారోగ్యానికి గురైన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పిళ్లా వెంకట నారాయణ పాత్రుడ్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం పరామర్శించారు. రాజయ్యపేటలోని పాత్రుడి ఇంటికి వెళ్లి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ సీనియర్ నాయకుడు ఉప్పిలి కనకరాజు, ఉగ్గిన గోవింద, గొరపల్లి శ్రీను, చిరికి దేముడు, మెంటి మహేష్, రాంబాబు, నక్కా మహేష్, బాదిరెడ్డి కృష్ణ తదితరులు ఉన్నారు.

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం



రామును సత్కరిస్తున్న కార్మిక సంఘం ప్రతినిధులు

పెందుర్తి: అసంఘటిత కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తామని అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అసంఘటిత కార్మిక సంఘం అధ్యక్షుడు విన్న కోట రాము అన్నారు. బుధవారం చినముషిడివాడలోని తన నివాసంలో జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నేతలు, సంఘం ప్రతినిధులు కలుసుకుని ఆయన్ని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, ముక్క రామునాయుడు, ఆర్.ఆర్.నాయుడు, భానుమూర్తి, కాళ్ల సత్యనారాయణ, కొండలరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. మాఘ పూర్ణిమ ఉత్సవం



బ్రహ్మకుమారీస్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ మల్లికార్జునరావు



తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



మాధవస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరంలో మాఘపౌర్ణమి తీర్థమహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని, పుణ్య స్నానాలు ఆచరించారు. మాఘ పూర్ణిమ సందర్భంగా మంగళవారం రాత్రి నుంచే భక్తులు తీరానికి చేరుకుని, రాత్రంతా తీరంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి జాగరణ చేశారు. బుధవారం సూర్యోదయాన సముద్రంలో పుణ్య స్నానాలు ఆచరించి సమీపంలోని మాధవస్వామిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం వాడచీపురుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తీరంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భక్తుల కోసం పలు స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పరవాడ, సబ్బవరం పోలీస్ స్టేషన్‌ల నుంచి అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీ విశ్వవిద్యాలయం వాడచీపురుపల్లి వారి ఆధ్వర్యంలో తీరంలో ఏర్పాటు చేసిన శివ సందేశ కార్యక్రమాన్ని సీఐ మల్లికార్జునరావు ప్రారంభించారు. సోమేశ్వరి, ప్రభాకరమూర్తి, ఆదిలక్ష్మి, విజయలక్ష్మి, సత్యవతి పాల్గొని భక్తులకు శివ సందేశాలను బోధించారు. కార్యక్రమంలో ముత్యాలమ్మపాలెం మాజీ సర్పంచ్ సీహెచ్ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా మాఘి ఉత్సవాలు



గోపూజలో పాల్గొన్న భక్తులు

సబ్బవరం: దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో మహా మాఘి ఉత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. శ్రీమేరులో కొలువైన ఖడ్గమాల దేవతల ప్రతిష్ఠాపన జరిగి నేటికి 31 ఏళ్లు పూర్తయినట్లు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. ఉదయం గోపూజతో కార్యక్రమం ప్రారంభించారు. వేదమంత్రాల నడుమ 108 పవిత్ర కలశాలను శరణు ఘోషతో శ్రీమేరు, గణపతి ఆలయాల పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకొచ్చి ఖడ్గమాల దేవతల వద్ద ఒక్కొక్కటిగా ఉంచారు. 9వ ఆవరణ కేంద్ర బిందువులో ఉన్న సహస్రాక్షి అమ్మవారికి, ఆవరణలోని మిగిలిన దేవతలకు వేద మంత్రాలతో, కళావాహన, లలితా సహస్ర నామం, ఖడ్గమాల స్తోత్రాలతో పూజించారు. ప్రయాగరాజ్ మహా కుంభమేళా నుంచి తెచ్చిన పవిత్ర జలాలతో అభిషేకించారు. హైదరాబాద్‌కు చెందిన కొండూరి పద్మావతి శిష్య బృందం సౌందర్యలహరి పారాయణ ఆకట్టుకుంది.

రేపు వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



వేణుగోపాలస్వామి

పెందుర్తి: పురుషోత్తపురంలో కొలువుదీరిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం, తీర్థం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు జరుతాయన్నారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమంలో దాదాపు 6 వేల మందికి అన్నప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సాయంత్రం పులివేషాలు, సాముగరిడీలు, కోలాటాలు, కృష్ణుడి వేషధారణలో నృత్యాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా వేడుకల్లో పాల్గొనాల్సిందిగా కోరారు. వేడుకల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

డెంగ్యూ కలకలం.. ఇంటింటా స్ప్రేయింగ్



ఇండోర్ స్ప్రేయింగ్ చేస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ: మండలంలోని పి.బోనంగి గ్రామానికి చెందిన డెక్క విష్ణువర్ధన్(16)కు డెంగ్యూ సోకింది. కేజీహెచ్‌లో చికిత్స అనంతరం ఇంటికి చేరుకుని, ఇంటి వద్దే వైద్య సేవలు పొందుతున్నాడు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కనకఅప్పారావు చెప్పారు. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీ సిబ్బంది బుధవారం గ్రామంలో పర్యటించి, ఇంటింటా ఇండోర్ స్ప్రేయింగ్ చేశారు. పోతినమల్లయ్యపాలెంలోని ఓ ప్రవేట్ కళాశాలలో చదువుతున్న విష్ణువర్ధన్ వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. కేజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ సోకినట్లు వైద్యులు గుర్తించి, అనకాపల్లి మలేరియా కార్యాలయానికి సమాచారం అందించారు. దీంతో సమాచారాన్ని అందుకున్న కనకఅప్పారావు తన సిబ్బందితో గ్రామంలో ఇండోర్ స్ప్రేయింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది వి.సత్యనారాయణ, బి.కవితసాయి, అనిత, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం నిత్య జీవనంలో భాగం కావాలి

పెందుర్తి: మానవ జీవనంలో ధ్యానం ఓ భాగం కావాలని హైదరాబాద్‌కు చెందిన ధ్యాన గ్రాండ్ మాస్టర్ డి.వి.కృష్ణారెడ్డి అన్నారు. పాపయ్యరాజుపాలెంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో బుధవారం పౌర్ణమి ధ్యానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నియంత్రణకు ధ్యానం ఎంతగానో దోహదపడుతుందన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, నిరంతర జీవన ప్రక్రియలో ధ్యానం ఆవశ్యకతను వివరించారు. ధ్యాన మాస్టర్లు, ఔత్సాహిక ధ్యానులు మౌన ధ్యానం చేశారు. ధ్యాన కేంద్ర నిర్వాహకులు, ధ్యాన మాస్టర్లు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకోండి

- జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

సబ్బవరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రిజిస్ట్రీలో రైతుల వివరాలను త్వరితగతిన నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు తెలిపారు. మండలంలోని బంగారమ్మపాలెం గ్రామ సచివాలయంలో జరుగుతున్న రైతు నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో రైతులందరూ తమ పేర్లను నమోదు చేసుకుంటే ఆధార్ తరహాలో 11 నంబర్లతో కూడిన ఓ యూనిక్ ఐడీని కేటాయించనున్నట్లు తెలిపారు. దీంతో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే పీఎం కిసాన్ భరోసా, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాలు పొందడం సులభమవుతుందన్నారు. అన్ని గ్రామాల రైతులు ఇందులో తమ పేర్లను నమోదు చేసుకునేలా గ్రామ వ్యవసాయ సహాయకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో తలెత్తుతున్న సాంకేతిక లోపాలను త్వరితగతిన సరిచేస్తామన్నారు. కార్యక్రమంలో బంగారమ్మపాలెం సర్పంచ్ దాడి లావణ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు బొబ్బరి లావణ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

బంగారమ్మపాలెంలో సప్తాహం

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెంలో ఈ నెల 15న ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా ఈ నెల 8 నుంచి 15 వరకూ రామాలయంలో దివ్యనామ సప్తాహం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా వారం రోజులపాటు నిర్విరామంగా 20 భజన బృందాలతో సప్తాహం కొనసాగుతుందని సర్పంచ్ లావణ్య తెలిపారు. గురువేద చారిటబుల్ ట్రస్ట్ రాపర్తి జగదీష్ ఆధ్వర్యంలో శరగడం రమేష్ సహకారంతో కార్యక్రమం జరుగుతోందన్నారు. గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, దొడ్డి రాజకోటి, సూరిశెట్టి సూర్యనారాయణ, దాడి సూరిబాబాబు పాల్గొన్నారు.

పెదనాయుడు చెరువు సమస్య కొలిక్కి



రైతులతో మాట్లాడుతున్న ఎస్‌డీసీ సీతారామరాజు, ఎన్‌హెచ్ 130 పీడీ రోహిత్ కుమార్ తదితరులు

సబ్బవరం: మేజర్ పంచాయతీ సబ్బవరం పరిధి పెదనాయుడుపాలెంలోని పెదనాయుడు చెరువు ఆయకట్టు రైతుల సమస్య కొలిక్కివచ్చింది. చెరువు గర్భం తగ్గిపోకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు భరోసానిచ్చారు. చెరువులోని కొంత భూమిని హైవే విస్తరణ కనెక్టివిటీ రోడ్డుకు తీసుకున్నారు. రైతులకు సమాచారం లేకుండా చెరువు గర్భాన్ని మూస్తుండటంతో రైతులు అడ్డుకున్నారు. రైతుల డిమాండ్‌తోపాటు, స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచనల మేరకు ఎస్‌డీసీ జె.సీతారామాంజనేయులు, ఎన్‌హెచ్–130 పీడీ రోహిత్‌కుమార్ తదితరులు స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో రైతులతో బుధవారం సమావేశం ఎర్పాటు చేశారు. రోడ్డు విస్తరణలో కోల్పోతున్న చెరువు విస్తీర్ణం మేరకు, రైతుల నుంచి భూమిని సేకరించి, చెరువు విస్తీర్ణం తగ్గకుండా చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో సైట్ ఇంజినీర్ రామకృష్ణ, ఇరిగేషన్ ఏఈ సాయికిరణ్, రైతులు కొటాన అప్పారావు, ఆదిరెడ్డి పోతురాజు, సబ్బవరపు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు

- రూ.1.20 కోట్లతో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్
- ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ





పోలిరెడ్డిపాలెం సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న పనులు

పరవాడ: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ లోఓల్టేజీ సమస్యల పరిష్కారానికి వీలుగా రూ.1.20 కోట్ల వ్యయంతో పోలిరెడ్డిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్(పీటీఆర్) ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీని నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని చెప్పారు. మండలంలోని 1500 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు విద్యుత్ లైన్లతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తద్వారా వ్యవసాయ మోటార్లకు లోఓల్టేజీ సమస్య పునరావృతం కాకుండా ఉంటుందన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 13 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.30 లక్షలు జరిమానా విధించినట్లు స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. బుధవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు.